టీడీపీ అభ్యర్థుల విజయం

- రూరల్ ఎమ్మెల్యేగా గోరంట్ల గెలుపు
- సిటీలో ఆదిరెడ్డి వాసు విజయం



ఆర్వో తేజ్ భరత్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



సిటీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి వాసుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి దినేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురువేశారు. రూరల్‌లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి తన తన ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణపై 64,090 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలోనే మొదటగా రూరల్‌లో ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. గోరంట్ల రూరల్‌లో వరసగా 2014, 2019, 2024లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఆయన అంతకు ముందు రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు సార్లు పోటీ చేసి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. రూరల్‌లో 2,72,826 ఓట్లకు గాను పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 2,02,058 ఓట్లు పోలయ్యాయి. మొదటి రౌండ్ నుంచి గోరంట్ల తన ఆధిక్యతను చాటుకుంటూ వచ్చారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరికి 1,29,060, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు 64,970, బీఎస్పీ అభ్యర్థి కొండపల్లి సూరిబాబుకు 1,217, కాంగ్రెస్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్‌కు 2,728, భారతీయ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి దుగ్గిరాల శ్రీదేవికి 360, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి మన్నవ రఘురామ్‌కు 310, ఇండిపెండెంట్ చింతలపాటి పవన్ కుమార్‌కు 714, నోటాకు 2,699 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ ముగిసిన అనంతరం రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ చేతుల మీదుగా బుచ్చయ్య చౌదరి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

సిటీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ: సిటీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు విజయం సాధించారు. నన్నయ యూనివర్సిటీలో జరిగిన ఓట్ల లెక్కింపులో ఆదిరెడ్డి వాసు 1,23,291 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ 51,887 ఓట్లు సాధించారు. ఆదిరెడ్డి వాసుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రం అందజేశారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఆదిరెడ్డి వాసుకు 1,827, భరత్ రామ్‌కు 741 ఓట్లు పోలయ్యాయి. సిటీ నియోజకవర్గంలో మొత్తం పది మంది పోటీ పడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల మినహా మిగిలిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోడా వెంకట్ 1,860 ఓట్లు, 58 పోస్టల్ బ్యాలెట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి సురేఖ పడమట 1,084 ఓట్లు, 12 పోస్టల్ బ్యాలెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి బి.కృష్ణ చైతన్య 176 ఓట్లు, రెండు పోస్టల్ బ్యాలెట్లు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడా శ్రీనివాసరావు 1,524 ఓట్లు, 30 పోస్టల్ బ్యాలెట్లు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి యనమదల మోహన్ బాబు 156 ఓట్లు, జనవాహిని అభ్యర్థి వేమన గణేష్ 118 ఓట్లు, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థి వంగూరి విజయ సత్య 198 ఓట్లు, ఒక పోస్టల్ బ్యాలెట్, స్వతంత్ర అభ్యర్థి బేతాల వెంకటేశ్వరరావు 185 ఓట్లు సాధించారు. నోటాకు 23 పోస్టల్ బ్యాలెట్లు, 1,546 ఈవీఎం ఓట్లు పోలయ్యాయి.

క్లుప్తంగా

251 మందికి వైద్య పరీక్షలు



కడియంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడియం: మండలంలోని కడియపులంక సచివాలయం 3 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 251 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మణిజ్యోత్స్న తెలిపారు. వీరిలో ఒకరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశామన్నారు. జనరల్ సర్జన్ పూర్ణిమ, గైనకాలజిస్ట్ ఝాన్సీలక్ష్మి, ఆప్తాల్మిక్ టెక్నీషియన్ సాంబయ్యలు తమ బృందంతో వైద్య పరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

తమలపాకులతో అలంకరణ



తమలపాకుల అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరం ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని మంగళవారం తమలపాకులతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వర్తకులు, రైల్వే ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి భారీఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీకే మెజారిటీ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 1,640 మంది బ్యాలెట్ ఓట్లు వేశారు. వాటిలో అత్యధికంగా టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు 1,023 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుకు 543 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరుణ కుమారికి 34, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మూడు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి రెండు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థికి ఎనిమిది ఓట్లు పడ్డాయి. కొక్కిరిపాటి చిన బాబు, కమల ఆరుగొలనులకు ఒక్కొక్క పోస్టల్ ఓటు పడింది. మరో అభ్యర్థి బొంత కిషోర్‌కు నాలుగు ఓట్లు పడ్డాయి. అయితే నోటాకు మాత్రం 21 ఓట్లు పడ్డాయి. అయితే స్వతంత్ర్య అభ్యర్థులైన ఊబా శ్రీకాంత్, తాతపూడి ప్రవీణ్‌లకు ఒక్క ఓటు పడకపోవడం విశేషం.

సొసైటీల్లో వరి విత్తనాల విక్రయాలు

తాళ్లపూడి: రైతుల ఖరీఫ్ వరి సాగుకు అవసరమైన వరి విత్తనాలు మండలంలోని అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట, రాగోలపల్లి, తాడిపూడి, మలకపల్లి సొసైటీల్లో రైతులు తమకు అవసరమైన వరి విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అంతే కాకుండా తాళ్లపూడిలో కూడా ప్రత్యేకంగా మార్టేరు వారి ఆధ్వర్యంలో వరి విత్తనాలు విక్రయిస్తున్నారన్నారు. 30 కిలోల వరి విత్తనాల ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. పీఎల్ -1100 రకం రూ.1185, 1318 రకం రూ.990, 1061 రకం రూ.1180, స్వర్ణ- 7029 రకం రూ.1200, సంపద గోల్డ్ -9558 రకం రూ.1700 రేటుకు విక్రయించనున్నట్టు ఏవో వివరించారు.

ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

కడియం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మంగళవారం పలు రద్దీ రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారిపోయాయి. ఉదయం ఆరు గంటల నుంచే వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా కన్పించే కడియం-వేమగిరి, కడియం - వీరవరం - దుళ్ల రోడ్డు, వేమగిరి నుంచి పొట్టిలంక వరకు జాతీయ రహదారిపై సైతం పెద్దగా జనసంచారం కన్పించలేదు. పోలీసు ఆంక్షల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై టీవీల్లో వచ్చే లైవ్ టెలికాస్ట్‌లు, సోషల్ మీడియాపై ఆధారపడి ఎన్నికల ఫలితాలను గురించి ఆసక్తిగా చూశారు. మధ్యాహ్నం రెండుగంటల సమయానికి కూటమికే విజయావకాశాలు కన్పించడంతో పలు చోట్ల టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీల జెండాలు పట్టుకుని రోడ్లపైకి వచ్చారు. మండల కేంద్రమైన కడియం, కడియపుసావరం, వీరవరం, దుళ్ల తదితర గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల హడావుడి కనిపించింది. ర్యాలీలలో అత్యుత్సాహం ప్రదర్శించారు. మద్యం అవుట్ లెట్లు ముందు గానే మూసివేయించడం, 144, పోలీస్ యాక్ట్ 30లను అమలు చేయడం ద్వారా ముందు గానే హెచ్చరికలు జారీ చేసి ఎక్కడికక్కడే విజయోత్సవాలను కట్టడి చేసే ప్రయత్నాన్ని పోలీస్‌లు చేపట్టారు. అయితే మంగళవారం మధ్యాహ్నం అక్కడక్కడ జరిగిన మోటారు సైకిల్ ర్యాలీలను చూసీచూడనట్టు వదిలేశారు.

డంపింగ్ యార్డులా హండ్రెడ్ ఫీట్ రోడ్డు



హండ్రెడ్ ఫీట్ రోడ్డు పక్కన వేసిన చెత్తా చెదారం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి నుంచి ఎండోమెంట్ వాంబే కాలనీ మీదుగా నిర్మించిన హండ్రెడ్ ఫీట్ రోడ్డు డంపింగ్ యార్డులా మారిపోయింది. ఆ రోడ్డులో వాహన చోదకులతో పాటు ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్లు నడుస్తారు. అయితే ఈ రోడ్డు పక్కనే పేరుకుపోతున్న చెత్తా చెదారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో పలు చోట్ల నుంచి బిల్డింగ్ వ్యర్థాలతో పాటు చెత్తను తీసుకువచ్చి ఈ రోడ్డు పక్కనే డంపింగ్ చేస్తున్నారు. వాటి కారణంగా ఆ ప్రాంతం చిన్న డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఈ విషయాన్ని నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ధర్మారెడ్డి కోరుతున్నారు.

సాయికృష్ణకు డాక్టరేట్ ప్రదానం

నల్లజర్ల: స్థానిక ఏకేఆర్జీ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు నల్లజర్ల సాయికృష్ణకు విశాఖ పట్టణానికి చెందిన గీతమ్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జీర్ణకోశ వ్యాధులైన హెమరాయిడ్స్‌పై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు గాను తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు నల్లజర్ల సాయికృష్ణ మంగళవారం తెలిపారు. గీతమ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంటా సుహాసిని పర్యవేక్షణలో తానీ పరిశోధన వ్యాసాన్ని పూర్తి చేసినట్టు వివరించారు. సాయికృష్ణను ఏకేఆర్జీ విద్యాసంస్థల కరస్పాండెంట్ చావా గోఖుల్, సెక్రటరీ వడ్లమూడి రామారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రఘువీరవర్మ, అధ్యాపకులు అభినందించారు.

ఖరీఫ్ ఆకుమడులు సిద్ధం



చినకొండేపూడిలో దంప వరి ఆకుమడి

సీతానగరం: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆయకట్టులో 14 వేల ఎకరాలు ఉండగా, అనధికారికంగా మరో ఆరు వేల ఎకరాలు సాగవుతోంది. మోటార్లు ఉన్న పొలాల్లో ఇప్పటికే ఆకుమడులు వేశారు. ఇందులో మెట్ట ఆకుమడులు, దంప ఆకుమడులు ఉన్నాయి. మెట్ట ఆకుమడులు దుక్కు దున్ని వరి విత్తనాలు వేసి నీరు పెడుతూ ఉంటారు. దంప ఆకుమడులు దుక్కు దున్నిన అనంతరం దమ్ము చేసే విధంగా ఆకుమడులు తయారు చేసి విత్తనాలు జల్లి ఆకుమడి తడి ఆరకుండా నీటిని పెడుతుంటారు. మోటార్ల వద్ద నీరు అందుబాటులో ఉంటుంది కనుక రైతులు దంప మడులు వేస్తారు. మెట్ట ఆకుమడులు నీరు అందుబాటులో లేని దూర ప్రాంత పంటపొలాల్లో వేస్తారు. ఇప్పటికే దంప మడులు రైతులు వేశారు.

మండలంలో సుమారు ఐదువేల ఎకరాలకు సరిపడా వరి ఆకుమడులు వేశారు. జూన్ 15 దాటిన అనంతరం మెట్ట ఆకుమడులు వేస్తారు. రైతులు సాంబమసూరి, పీఎల్ రకం వరి వంగడం ఎక్కువగా వేస్తారు.

ఈత పండు.. రుచి మెండు



ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్న ఈత పండ్లు



నోరూరిస్తున్న ఈత పండ్లు

రంగంపేట: సీజన్ల వారీగా ఎన్నో రకాల పండ్లు అందుబాటులోకి వస్తుంటాయి. ప్రకృతి ప్రసాదించిన అటువంటి పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయి. వేసవిలో విరివిగా పుచ్చకాయలు, తాటి ముంజెలు, మామిడిపండ్లు, సపోటా ఇలా అనేక రకాల పండ్లు కనిపిస్తుంటాయి. ఆ కోవలోనే ఈత చెట్ల నుంచి వచ్చే ఈత పండ్లు కూడా ఉన్నాయి. ఈత పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉన్నాయి. పిండి పదార్థాలు, చక్కెర, పీచు పదార్థం, కొవ్వు, మాంసకృతులు, విటమిన్-సి ఉండటంతో వేసవిలో ఈ పండు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఈత పండ్ల ద్వారా ఈత బెల్లం కూడా తయారు చేస్తారు. బెల్లానికి కూడా మంచి డిమాండ్ ఉంది.

ఏడీబీ రోడ్డులో విక్రయాలు

ఇంతటి మధురమైన పండ్లను చిరు వ్యాపారులు ఏడీబీ రోడ్డులో విక్రయిస్తున్నారు. ఈత గెలలను, ప్యాకెట్లలో ఈత పండ్లను అమ్ముతున్నారు. గెల మొత్తం కొంటే రూ.100 నుంచి రూ.150కు, ప్లాస్టిక్ కవర్లో రూ.20కు విక్రయిస్తున్నారు. ఏడీబీ రోడ్డులో కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు వీటిని కొనుగోలు చేస్తున్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు



పెద్దేవంలో అల్లర్లు జరగకుండా గస్తీ కాస్తున్న పోలీసులు

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలు చేశామని తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్ సుందర్ తెలిపారు. పెద్దేవం సెంటర్‌లో కొందరు టీడీపీ జెండాలతో హడావుడి చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి గొడవలు జరగకుండా చక్కబరిచారు. కాగా వేగేశ్వరపురంలో ఒక పికెట్ ఏర్పాటు చేశారు. మండలంలో రెండు స్ట్రైకింగ్ ఫోర్స్‌లు పర్యటించాయి. శాంతి భద్రతలకు విఘాతం కల్పించరాదని ఎస్సై తెలిపారు.

టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు

సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మండల ప్రజలు మంగళవారం టీవీలకు అతుక్కుపోయారు. ఉదయం నుంచీ ఫలితాలను ఉత్కంఠగా టీవీల్లో ఆసక్తిగా తిలకించారు. దాదాపు మండలంలోని అన్నిచోట్లా ఎన్నికల ఫలితాలపైనే చర్చ సాగింది. మండలం నుంచి వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు నన్నయ విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలి వెళ్లారు.

7 నుంచి అమ్మవార్ల జాతర



ముత్యాలమ్మవారు

చాగల్లు: మార్కొండపాడు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వారి జాతరను ఈ నెల 7వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత నెలలో అమ్మవార్లను నడి వీధిలోని పూరి గుడిసెలోకి తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి పూరిగుడిసె వద్దే పూజలు నిర్వహిస్తున్నారు. పన్నెండేళ్ల కోసారి నిర్వహించే అమ్మవార్ల జాతర రోజుల్లో గ్రామం అంతా సందడి నెలకొంటుంది. అమ్మవారి ఆశీస్సుల కోసం పరిసర గ్రామల నుంచి కూడా భక్తులు భారీగా వస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ నెల 7న అమ్మవార్ల సేవ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించనున్నారు. 8న బలిచేట, 9న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలియచేశారు.



అమ్మవారి పూరి గుడిసె

సినిమాలు



శ్యామల	గంగం గణేశా
సూర్యమినీ	మిస్టర్ అండ్ మిసెస్
మహి	
సూర్యప్యాలెస్	భజే వాయువేగం
స్వామి	భజే వాయువేగం
శివజ్యోతి	లవ్‌మీ
అనుశ్రీ	హిట్‌లిస్ట్
రాజా	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	ఆ ఒక్కటీ అడక్కు
రంభ	రాజు యాదవ్
మేనక	బాక్
అప్సర	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నామవరం	
వీఎస్ మహల్	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం	
వెంకటసూర్య	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజే వాయువేగం

మెట్టలో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభం

- సాగుకు రైతుల సన్నద్ధం
- అనుకూలిస్తున్న వాతావరణం



సీతానగరంలో వరి నారును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



నరేంద్రపురంలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాజానగరం: నైరుతి రుతుపవాల ప్రభావంతో కురుస్తున్న తొలకరి జల్లులు ఖరీఫ్ సాగుకు అన్నదాతలను సమాయత్తం చేస్తున్నాయి. ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్న తుపానుల తాకిడి తగలకుండా సకాలంలో సాగు చేపట్టాలని రైతులను వ్యవసాయాధికారులు చైతన్యపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణం కూడా అనుకూలించడం వారిలో మరింత ఉత్తేజాన్ని కలిగిస్తోంది. సీజన్ ఏదైనా తమదే ముందడుగు అనే మెట్ట రైతుల బాటలోనే డెల్టాలో కూడా అన్నదాతలు ఖరీఫ్ సాగుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకునే పనులను అధిగమించి, నార్లు వేయడంలో బిజీగా ఉన్నారు. బోర్లు ఉన్న రైతులు మాత్రం ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. అయితే ఈ సమయంలో స్థానికంగా కూలీ కొరత రైతాంగాన్ని వేధిస్తున్నా, ఆ లోటును భర్తీ చేస్తూ బెంగాలీ కూలీలు సాగులో చురుకైన పాత్రను పోషిస్తున్నారు.

సాగుకు శ్రీకారం

సాగునీటి సదుపాయాలు సమృద్ధి లేకపోయినా, గొట్టపు బావుల సదుపాయంతో రాజానగరం, గండేపల్లి, రంగంపేట, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, బిక్కవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి ప్రాంతాలలో రైతులు ఖరీఫ్ వరిసాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలుచోట్ల వరినార్లు వేసి ఉండటంతో నాట్లు వేయడం ప్రారంభమైంది. ముఖ్యంగా రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెంలలో వారం రోజులుగా వరి నాట్లు వేయడంలో రైతాంగం ముమ్మరంగా ఉంది. అయితే స్థానికంగా కూలీల కొరత ఉన్నప్పటికీ ఆ లోటును బెంగాలీ కూలీలు ఏడు సంవత్సరాలుగా భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడకు చేరుకున్న బెంగాలీ కూలీలు ద్వారా మెట్ట ప్రాంతాల్లోని పొలాలలో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

క్రమపద్ధతిలో వరినాట్లు

బెంగాలీ కూలీల వరినాట్లు వేసే విధానం ఒక పద్ధతిలో ఉంటూ వ్యవసాయాధికారులను ఆకట్టుకుంటుంది. వరినారు తీయడం, క్రమపద్ధతిలో నాట్లు వేయడమంతా మగకూలీలే చేస్తారు. ఇందుకు ఎకరానికి రూ.3500 తీసుకుంటారు. దీని వల్ల ఖర్చులు, సమయం ఆదా కావడంతో పాటు ఒకటి, రెండు మొక్కలనే తీసుకుని నాటడం వలన దుబ్బులు బాగా చేసి, దిగుబడులు కూడా బాగుంటున్నాయని రైతులు అంటున్నారు. నెలాఖరునాటికి మిగిలిన ప్రాంతాలలో కూడా వరి నాట్లు వేయడం ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. పలు ప్రాంతాలను సందర్శిస్తూ వస్తున్న అధికారులు నార్లు వేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వరి నాట్లు వేయడం తదితర వాటిలో రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

చురుకుగా సాగు పనులు

మెట్ట ప్రాంతంలో బోర్లు అధికంగా ఉన్న రాజానగరం పరిసర ప్రాంతాలలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన ప్రాంతాలలో నారుమడులు కడుతున్నారు. నెలాఖరు నాటిని పూర్తిస్థాయిలో నారు సిద్ధం కావడమే కాకుండా నాట్లు వేయడం కూడా వేగవంతం అవుతుంది. ప్రస్తుతం నైరుతి రుతు పవనాలు ప్రారంభించి, అడపాదడపా వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతాంగం సాగు పనుల్లో బిజీగా ఉంది. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

– ఎస్. మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి